కథ

# ముందుచూపు

**"మంచి సంబంధం. అన్నీ బాగున్నాయ్. కానీ ఏం చేస్తాం. జాతకాలు కలవలేదు. ప్చ్!" అని నిరాశగా నిట్టూర్చాడు భరద్వాజ.**

**"అవునా?!" అంటూ భర్త నిరాశలో తనూ భాగం పంచుకుంది కాత్యాయని.**

''గోత్రం వేరయితే ఋషులు కలుస్తున్నాయి. ఆ రెండూ సరిపోయాయి కదా అనుకుంటే జాతకాలు కలవవు. చచ్చే చావుగా వుంది. తిరగలేక చచ్చిపోతున్నాను ఈ పిల్ల పెళ్లి కోసం. ఇప్పటికి రెండు చెప్పుల జతలు అరిగిపోయాయి'' అన్నాడు భరద్వాజ.

''ఆడపిల్లను కన్నాక తప్పుతుందా. అందుకే అన్నారు ఆడపిల్ల గుండెలమీది కుంపటి లాంటిదని. ఆ విజయవాడ సంబంధం ఏమయింది? అదన్నా కనుక్కోండి'' అంది కాత్యాయని.

''శాస్త్రులుగారి దగ్గరికి వెళ్లొస్తాను ఇప్పుడే''

''అన్నీ కుదిరితేగానీ వ్యవహారం పెళ్లిచూపుల వరకు రాదు మరి. త్వరగా వెళ్లండి''

భరద్వాజ షర్టు వేసుకుని బయటికి వెళ్లటం కోసం చెప్పులు వేసుకుంటున్నాడు.

నెలరోజులుగా ఇంట్లో తన పెళ్లి ప్రయత్నాలు జరుగుతున్న తతంగాన్ని నిశ్శబ్దంగా గమనిస్తున్నది సమీర.

ఆమెకు చిరాకుగా వుంది. కోపంగా వుంది. అస్థిమితంగా వుంది. గోత్రాలు, జాతకాలు అంటూ తన ప్రమేయం ఏమీలేకుండానే తల్లీ తండ్రీ సంబంధాల వేటలో మంచి చెడులు నిర్ణయించడం ఆమెకు బొత్తిగా నచ్చలేదు.

'కాలం మారుతున్నా ఈ పెద్దలు మాత్రం మారరు. చదువుకున్న ఆడపిల్లలు తమకు కావలసిన వరుణ్ణి తామే ఎన్నుకుని కులాలు, మతాలు, జాతకాలకతీతంగా పెళ్లిళ్లు చేసుకుంటుంటే తన ఇంట్లోవాళ్లకు మాత్రం అవి కనబడవు. వినబడవు. ఏనాడయినా తనను దగ్గరికి పిల్చి 'అమ్మా. నీకు ఎటువంటి వరుడు కావాలి. నీ భర్త ఎన్నికలో మనం పాటించాల్సిన నియమాలు, తీసుకోవల్సిన నిర్ణయాలు ఎటువంటివి అని అడిగారా? ఇద్దరూ ఒకటై వాళ్ల ఇష్టాయిష్టాలు, వాళ్ల అభిప్రాయాలు తనవిగా తన నెత్తిన రుద్ది తలవంచి మూడుముళ్లు వేయించాలని చూస్తున్నారు'' అన్న ఆలోచనలు ఉక్రోషాన్ని, రోషాన్ని కలిగిస్తున్నాయి సమీరలో.

'ఇంక లాభం లేదు. ఇప్పటికయినా వాళ్ల పద్ధతిలో సాగుతున్న ఈ పెళ్లి కొడుకుల అన్వేషణను తాను అడ్డుకోకపోతే వాళ్లకు అనవసర శ్రమ, తనకు అధిక మనస్తాపం తప్పదు' అన్న నిర్ణయానికి వచ్చి-వెళ్లి తన తల్లిదండ్రుల ఎదుట నిల్చుంది సమీర.

''డాడీ. మీరు నాకు తగిన వరుణ్ణి వెతకటానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా నా అభిప్రాయం ఒకటి మీరు అడక్కపోయినా చెప్పాలనుకుంటున్నాను'' అంది ధైర్యంగా.

భరద్వాజ, కాత్యాయనీ ఇద్దరూ ఒకేసారి ఆశ్చర్యపోయారు. ఎన్నడూ పన్నెత్తి పెద్దగా మాట్లాడనయినా మాట్లాడని తన కూతురు, తల్లిదండ్రులంటే భయభక్తులతో మెలిగే తన చిన్నారి సమీర ఈరోజు ఆరిందాలా ముందుకు వచ్చి నిటారుగా నిల్చుని తల ఎత్తి అంత ధైర్యంగా మాట్లాడుతుంటే వాళ్లు అబ్బురపడిపోయారు. బయటకు వెళ్లబోతున్న భరద్వాజ లోపలికి వచ్చి కూతురి ముఖం వంక ఆసక్తిగా చూస్తూ ''సారీ అమ్మా. నిన్ను అడగాలన్న ఆలోచనే ఈ మట్టిబుర్రకు తట్టలేదు. నా ఎంపికలో ఇసుమంత కూడా లోపం ఉండదన్న గట్టి నమ్మకమే అందుకు కారణం అయివుంటుంది. ఇప్పుడు అడుగుతున్నాను చెప్పమ్మా. నీకు ఎలాంటి వరుడు కావాలి'' అని మనస్ఫూర్తిగానే ప్రశ్నించాడు భరద్వాజ.

కూతురు ఏం చెబుతుందో, ఆమె కోరికల లిస్టు ఎంత పెద్దదో అని ఆసక్తిగా వేచి చూస్తోంది కాత్యాయని.

సమీర తన్ను తాను ముందుగా ప్రిపేర్ చేసుకుని ఆ తరువాత గొంతు విప్పింది. ఆ కంఠంలో ఉద్వేగం, తొందరపాటు, కలవరపాటు లాంటి సంకేతాలు ఏమీలేవు. నెమ్మదిగా, తొణకని నిండు కుండలా, ప్రతి మాటలో విశ్వాసాన్నీ, స్థిరత్వాన్నీ నింపుకుంటూ అంది.

''డాడీ. నాకు మీరు తెచ్చే సంబంధాలలో మీరు చూడవలసింది జాతకాలు కాదు. పాతకాలపు అంధవిశ్వాసాలకు, చాదస్తాలకు స్వస్తి చెప్పి మనం కాలం వెంట నడవకపోతే భవిష్యత్తు భయంకరంగా మారిపోతుంది.''

''ఇంతకూ నువ్వనేది ఏమిటే?'' కుతూహలాన్ని అణచుకోలేని కాత్యాయని అసహనంగా ప్రశ్నించింది.

''వయసు, చదువు వంటివి నాకు, అతనికి మ్యాచ్ అవుతాయని అనిపించాక, ఒకరికొకరం ఇష్టపడ్డాక మ్యారేజ్ ఫిక్స్ అవటానికి ముందు అతను, నేను రక్తపరీక్షలు చేయించుకుంటాం. ఇది మీరు ఒక కండిషన్‌గా పెట్టండి. అతను బ్లడ్ టెస్ట్ రిపోర్ట్ తెచ్చాకే పెళ్లి కుదిరినట్లు లెక్క- అని గట్టిగా చెప్పండి'' అంది సమీర తొణకని బెణకని కంఠస్వరంతో.

''అదేంటి? రక్తపరీక్ష ఎందుకు?'' బోలెడంత ఆశ్చర్యపోతూ అంది కాత్యాయని.

''ఎందుకో పొద్దున్నే లేవగానే పేపరు తెరిస్తే తెలుస్తుంది. రేడియోలోనో, టీవీలోనో వార్తలు వినడమో, చూడడమో చేస్తే తెలుస్తుంది. ఎయిడ్స్ అనే భయంకర వ్యాధి భర్త నుండి భార్యకు, భార్య నుండి ఆమెకు పుట్టబోయే బిడ్డలకూ వస్తోంది. ఒక పురుషుడు తెలిసో, తెలియకో జీవితంలో వేసే ఒక్క తప్పటడుగు తరతరాల వరకు శాపంలా పరిణమించి మొగ్గలోనే బ్రతుకుల్ని బుగ్గిగా మార్చేస్తోంది. అందుకే నాకు కాబోయే భర్త ఆరోగ్యవంతుడని హెచ్.ఐ.వి పాజిటివ్ కాదని నాకు తెలియాలి.''

కూతురి మాటలకు భరద్వాజ ఆశ్చర్యంతో తల మునకలవుతుంటే కాత్యాయనికి చిర్రెత్తుకొచ్చి ''దీనికి డెఫినెట్‌గా పిచ్చి పట్టడమో, గాలి సోకటమో లాంటిది జరిగింది'' అంది.

''ఎయిడ్స్ గురించిన పరిజ్ఞానం వుంటే నువ్విలా మాట్లాడవు మమ్మీ''

''చదవేస్తే వున్న మతి పోవటం అంటే ఇదే. దేశంలో రకరకాల రోగాలు కోకొల్లలుగా వున్నాయి. అంతమాత్రాన పెళ్లిచూపులకొచ్చిన ప్రతివాడ్నీ అన్ని మెడికల్ టెస్ట్‌లూ చేయించుకుని నీకేం రోగాలున్నాయో ముందుగానే చెప్పు నాయనా అంటే ఆ పిల్లాడు ఇదో మెంటల్ కేసు అనుకుని భయపడి పారిపోతాడు. అవ్వ! ఫలానా వారి పిల్ల ఇలా అడుగుతోందని నలుగురూ అనుకుంటే మాకెంత పరువు తక్కువ'' అంది కాత్యాయని ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కుకుంటూ.

అంతవరకూ అక్కడ గడ్డకట్టినట్టున్న మౌనాన్ని బద్దలు చేస్తూ భరద్వాజ కూడా కలిగించుకుని అన్నాడు.

''మీ మమ్మీ చెప్పింది నిజమేనమ్మా! ఇంటికొచ్చిన పెళ్లివారినందరినీ నువ్వు ఇలాంటి ప్రశ్నలేస్తే

మళ్లీ ఇంకొకరెవ్వరూ ఈ గుమ్మం తొక్కరు. ప్రాక్టికల్‌గా నువ్వన్నది అసాధ్యం. ఎందుకంటే ఇది ఇండియా, ఫారిన్ కాదు. ఇక్కడ ఇలాంటివి వింటే అంతా నవ్వుతారు. హేళన చేస్తారు. విమర్శిస్తారు.''

తండ్రి మాటలకు నిరాశతో నీరసించిపోయింది సమీర మనసు.

''మీరన్నది నిజమే కావచ్చు డాడీ. కానీ సదుద్దేశంతో చేస్తున్న ఒక మంచిపనికి ఎవరో ఒకరు ముందుకొచ్చి అంకురార్పణ చేయాలి కదా. లోకులకు భయపడి అడుగు వెనక్కు వేస్తే మన భవిష్యత్తు, సమాజ శ్రేయస్సు సాధించగలమా. ఈ విషయంలో మాత్రం నన్ను బలవంతపెట్టకండి డాడీ. నా పెళ్లి విషయంలో మీరు తొందరపడకండి. నా కండీషన్‌కు ఒప్పుకునేవాడూ, నా మాటల్లోని ఔన్నత్యాన్ని గుర్తించగలిగినవాడు, కాలానికనుగుణంగా ఎదగగలిగిన మనసు వున్నవాడూ లభించినప్పుడే నేను పెళ్లి చేసుకుంటాను'' అని తన నిర్ణయానికి తిరుగులేదు అని అర్థం వచ్చేలా మరో మాట మాట్లాడకుండా విసురుగా అక్కడినుంచి వెళ్లిపోయింది సమీర.

కాత్యాయని, భరద్వాజ ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఆమె ముఖంలో కోపం, అతని ముఖంలో అయోమయం కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి.

సుడిగాలిలా తన గదిలోకి వచ్చి తలుపులేసుకుని పక్క మీద వాలిపోయింది సమీర. దిండులో తల దూర్చి పడుకున్న ఆమెకు ఆ సమయంలో తన ప్రాణస్నేహితురాలు కావేరి కళ్లముందు కదిలింది. వెంటనే కళ్లవెంబడి గిర్రున నీళ్లు తిరిగాయి. 'పాపం కావేరి' అనుకుంది సమీర జాలిగా.


★ ★ ★

అడుగులో అడుగుగా-
మాటలో మాటగా-
అన్నింటా తాముగా-
ఐదు సంవత్సరాలు కలిసి మెలిసి స్నేహం చేసారు సమీర, కావేరి.

జలపాతం లాంటి సమీరకు, ఆగి వున్న నది లాంటి కావేరికి జత ఎలా కలిసిందన్న ప్రశ్న వాళ్లిద్దర్నీ చూసిన ఎవరి మనసులోనయినా కలుగుతుంది.

కావేరి మధ్యతరగతి కుటుంబంలో పుట్టిపెరిగిన పిల్ల.

అధిక సంతానం, ఆర్థిక ఇబ్బందులు వంటి కుటుంబ సమస్యలతో మునిగి తేలుతున్న తల్లి దండ్రులు ఎలాగోలా కావేరి పెళ్లి చేసి తమ బాధ్యతల బరువును దింపుకోవాలన్న ఆరాటంలో సంబంధాలు చూడటం మొదలుపెట్టారు.



అప్పుడు కావేరికి పట్టుమని పద్దెనిమిదేళ్లు లేవు.

కట్నం పైసా అయినా అడక్కుండా పెద్దింటి సంబంధం ఒకటి కావేరిని తమ కోడల్ని చేసుకుంటామని అడగ్గానే 'కలిసొచ్చిన అదృష్టం ఇది' అనుకుంటూ పట్టలేని ఆనందంతో పెళ్లి జరిపించారు.

కావేరి చాలా అదృష్టవంతురాలు అన్నారు ఇరుగు పొరుగులు, బంధువులు. అత్తగారింట్లో అడుగుపెట్టిన ఓ సంవత్సరం కాపురం చేసాకగానీ తానెంత దురదృష్టవంతురాలో తెలియలేదు ఆమెకు.

ఆరోజు ఏడుస్తూ కావేరి తనకు రాసిన ఉత్తరంలోని ప్రతి అక్షరం ఇప్పటికీ గుర్తున్నాయి సమీరకు.

'సమీరా!

నా జీవితం సర్వనాశనమయిందే. ఇక్కడ నేను రెండురోజుల నుండీ గుండెలు పగిలేలా ఏడుస్తున్నాను. నా ఏడుపును ఎవరూ పట్టించుకోవడం లేదు. నన్ను చూసి ఎవ్వరూ 'అయ్యో పాపం' అనుకోవడం లేదు. అందుకే నా ప్రాణస్నేహితురాలివయిన నీకు చెప్పుకుని ఏడుద్దామని ఈ లెటర్ రాస్తున్నాను. ఈ కష్టకాలంలో నీకన్నా నాకు దగ్గరివారు ఎవరున్నారు?

సమీరా! నేను మోసపోయానే! పెళ్లి పేరుతో నన్ను అందరూ అన్యాయం చేసారు. పెళ్లి గురించిన ఆలోచనయినా నా మనసులోకి రాకముందే నాకు బలవంతపు పెళ్లి చేసి నన్నీ సంసారకూపంలో పడేసారు. అక్కడయినా ఆనందం వెతుక్కుందామని ప్రయత్నిస్తుంటే మొన్న తెలిసిన ఒక వార్త నన్ను అథఃపాతాళంలో పడేసినట్లయింది. 'నేను ప్రెగ్నెంట్'నని నీకు ఉత్తరం వ్రాస్తే ఒకపక్క అభినందనలు తెలుపుతూనే మరోపక్క మెత్తగా చీవాట్లు పెడుతూ వ్రాసావు 'నీకు బుద్ధిలేదు. అప్పుడే పిల్లలేంటి?' అని. ఇప్పుడు నేను వ్రాయబోతున్న నిజం నన్నే కాదు నీ గుండెలు కూడా బద్దలు చేస్తుందని నాకు తెలుసు. ఎప్పటిలాగే మొన్న నేను మళ్లీ గైనకాలజిస్టు దగ్గరికి వెళ్లాను. ఆవిడ ఏవేవో పరీక్షలు చేయించింది. రిపోర్ట్‌లో ఏమని వచ్చిందో తెల్సా. నాకు, నా గర్భస్థ శిశువుకు ఎయిడ్స్ అని. అది వినగానే నాకు ఈ ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్లు, ఆకాశం అమాంతం విరిగి నా నెత్తిన పడ్డట్టు అనిపించింది. అది ఎలా సోకిందో, ఎందుకు వచ్చిందో తెలియని అయోమయస్థితిలో రిపోర్ట్స్ మా వారికి చూపిస్తే ఆయన ఆశ్చర్యపోవటానికి బదులు మొఖం అదోలా పెట్టారు. ఆ ముఖంలో

డా. కొఠారి వాణీచలపతిరావు

ఏదో అపరాధ భావం కనిపించి నిలదీసి అడిగితే తప్పించుకునే సాకులేవో చెప్పి బయటికి వెళ్లిపోయారు.

మా అత్తగారిని అడిగితే 'వాడు కాస్త అల్లరిగా తిరుగుతున్నాడు' అని 'పెళ్లయితే దారికి వస్తాడ'న్న ఆలోచనతో నిన్ను కట్టబెట్టాం. మగవాడన్నాక పెళ్లాం వచ్చిందాకా మడికట్టుకుని కూర్చుంటాడా? అని సన్నాయి నొక్కులు నొక్కింది.

నాకు వళ్లుమండి ''నిజం చెప్పండి. పెళ్లి కాక ముందే మీ అబ్బాయికి ఎయిడ్స్ వుందికదూ'' అని గద్దించి అడిగితే ఆమె కాస్త కంగారు పడిపోయి ''మనిషన్నాక రోగాలు రాకుండా వుంటాయా? కాపురం చేస్తుంటే వచ్చిందాని అదృష్టాన్నిబట్టి ఎలాంటి రోగాలయినా మటుమాయమవుతాయని నమ్మాను. నీకు, నీ పుట్టబోయే బిడ్డకు కూడా అంటుకుంటుందని నేను కలగన్నానా?'' అంది.

ఆ సమాధానం, అక్కడికక్కడే ఆమె గొంతు పిసికి చంపేయాలన్నంత కోపాన్ని తెప్పించింది నాకు.

ఆ రాత్రి మా ఆయన్ని ''నన్నెందుకిలా మోస గించారు? నా జీవితాన్ని, నా భవిష్యత్తుని ఎందుకిలా కాల్చేస్తున్నారు?'' అని అడిగినందుకు తల్లీ, కొడుకూ ఏకమై నానా రభస చేసారు.

దిక్కున్నచోట చెప్పుకోమన్నంత తీవ్రస్థాయిలో మొండిగా వాదించారు. ఎవరికి చెప్పుకోను నీకు తప్ప?

అమ్మకు చెబితే 'అదేం జబ్బే.. అంతగా బాధపడిపోతున్నావ్?' అని ఆశ్చర్యపోయింది.

ఆమెకు ఎయిడ్స్ గురించి ఏమాత్రం తెలియదు. 'కాన్సర్ గురించి విన్నానుగానీ ఇదేంటి?' అని అడిగింది.

నాన్న ఆయన్ని కాసేపు తిట్టి నా ఖర్మానికి చింతించి మిన్నకున్నారు.

ఈ పరిస్థితిలో ఎవరు మాత్రం ఏం చేయగలరు? నువ్వు అయినా నన్ను గురించి ఆలోచించి బాధపడకు. ఆడవాళ్లకు జరుగుతున్న అన్యాయాల గురించి అందరికీ తెలియాలనే అక్కసును అణచుకోలేక నీకు వ్రాస్తున్నాను. ఇంక నిన్ను బాధపెట్టను.

ప్రస్తుతానికి ఉంటాను.
నీ మిత్రురాలు
కావేరి'

కళ్లముందు నిలిచిన ఉత్తరాన్ని మనసులోనే చదువుకుని మానని గాయానికి మరోసారి వేదనను అనుభవించింది సమీర.

ఆ ఉత్తరం తర్వాత మరొక్క ఉత్తరం వచ్చింది కావేరి నుంచి.

'మా అత్తగారు, మా ఆయన నన్ను ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మన్నారు. పొమ్మన్నా ఇంకా ఆ ఇంటి చూరు పట్టుకుని వేళ్లాడలేక ఎటో వెళ్లిపోతున్నాను. అక్కడికి వచ్చి మిమ్మల్ని అందర్నీ బాధపెట్టడం ఇష్టంలేదు. అందుకే అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నాను నా బిడ్డతోసహా' అని వ్రాసింది.

మరోసారి తన కూతుర్ని గురించి వ్రాస్తూ 'నాకు తోడుగా మరో దురదృష్టవంతురాలు పడిందే సమీరా.

ముద్దులొలికే దాని ముఖం, అమాయకమైన ఆ కళ్లు చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. ఏం తప్పు చేసిందని దానికి ఈ శిక్ష? ఎవరో చేసిన పాపం మొగ్గలోనే దాని బ్రతుకును తుంచేయబోతుంటే ఏమీచేయలేక ప్రేక్షకురాలిలా చూస్తుండిపోతున్నాను. ఈ భూమిమీద దాని ఉనికి ఏడాదో, రెండేళ్లో' అని ఆవేదన పడింది.

ఆ తరువాత కావేరి నుంచి ఉత్తరాలు ఆగిపోయాయి. ఎంత ప్రయత్నించినా తన అడ్రసు కనుక్కోలేకపోయింది సమీర. ఆ తరువాత నాలుగేళ్ల వయసులో కావేరి కూతురు చచ్చిపోయిందనీ, మరో రెండు సంవత్సరాలకు కావేరి కూడా ఈ లోకాన్ని విడిచిపోయిందని తెలిసింది.

కావేరి నిష్క్రమణ సమీర మనసులో బలమైన గాయాన్ని చేసింది. కావేరి జీవితం సమీరకు కొత్త పాఠం నేర్పినట్లయింది.

'ఎవరో వచ్చి ఏదో చేస్తారన్న'ది పిచ్చిమాట. ఎవరి జీవితాన్ని వాళ్లే తీర్చిదిద్దుకోవాలి. ఎవరి భవిష్యత్తుకు వాళ్లే గట్టి పునాదులు నిర్మించుకోవాలి. ఎవరో ఏదో అనుకుంటారని భయపడి, మొహమాటంతో మౌనం వహిస్తే జీవితం మొక్కదశలోనే వేళ్లతోసహా పెకిలించబడుతుంది అన్న భావాలు సమీర హృదయంలో బలంగా స్థిరపడిపోయాయి. అందుకే ఈ ఒంటరి పోరాటం-

★ ★ ★

సమీరకు ఆరోజు పెళ్లి చూపులు. అంతా హడావుడిలో వున్నారు.

కూతురికి తల్లీ, తండ్రీ వార్నింగ్ మీద వార్నింగులు ఇస్తున్నారు 'నోరు మూసుకుని కూర్చోవాలని'

సూటూ బూటులో పెళ్లికొడుకు వచ్చాడు.

పొందూరి పంచెలో అతని తండ్రి, మడత నలగని పట్టుచీరలో తల్లి వచ్చి ఠీవిగా మగపెళ్లివారి హోదాలో కూర్చున్నారు.

భరద్వాజ, కాత్యాయని వంగి వంగి వాళ్లకు మర్యాదలు చేస్తున్నారు. ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపించారు సమీర మీద.

''ఏం చదువుకున్నావ్? నీ ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటి?'' అని తండ్రి అడిగాడు.

''వంటలు చేయడం వచ్చా? ఇంటిని దిద్దుకునే నేర్పు నీకు వుందా?'' అని తల్లి ప్రశ్నించింది.

''చాలా ఫాస్ట్‌గా వుండే లేడీస్ అంటే నాకిష్టం. మోడ్రన్ థింకింగ్ ఈ కాలపు ఆడపిల్లల స్పెషాలిటీ. మీరూ ఆ టైపే కదా?'' అని ప్రశ్నించాడు పెళ్లికొడుకు.

అన్నిటికీ ఓపిగ్గా సమాధానం చెప్పింది సమీర. నొసలు చిట్లించకుండా కళ్లల్లో చిరాకు వ్యక్తం కాకుండా చిరునవ్వుతో సమాధానం చెప్పింది.

కాత్యాయని, భరద్వాజ మురిసిపోయారు.

'పిల్ల లక్షణంగా వుంది' అని సంబరపడిపోయారు పెళ్లివారు.

'జాతకాలు బ్రహ్మాండంగా కలిసాయి' అని అరిచి మరీ చెప్పాడు శాస్త్రులుగారు.

అలాంటి సమయంలో తనంత తానుగా కంఠం విప్పి 'నాది ఒక రిక్వెస్టు' అంది సమీర అందరికీ వినిపించేలా స్పష్టంగా.

ఆశ్చర్యంతో అందరూ తలెత్తి చూసారు.

పెళ్లికొడుకును ఉద్దేశించి అంది సమీర.


''పెళ్లికి ముందు మనం బ్లడ్ టెస్ట్ చేయించుకోవాలి. 'హెచ్.ఐ.వి నెగెటివ్' వస్తేనే పెళ్లి...''

ఆరడుగుల ఆ కుర్రవాడు అదిరిపడ్డాడు ఆ రిక్వెస్ట్ విని.

పెళ్లి పెద్దలు నోరు వెళ్లబెట్టారు.

పెళ్లికొడుకు తల్లి ''బ్లడ్ టెస్ట్ అంటుందేమిటి ఈ అమ్మాయి?'' అని అయోమయంగా భర్త వంక చూసింది.

పెళ్లికొడుకు తండ్రి చటుక్కున లేచి నిల్చుని భార్యను, కొడుకుని ఉద్దేశించి ''లేవండి... లేవండి... ఇంకా సిగ్గులేక కూర్చున్నారేం? ఇలా బరితెగించి మాట్లాడే ఆడపిల్లలున్న కుటుంబం అని ముందు తెలిస్తే గడపలో అడుగు పెట్టేవాళ్లం కాదు...'' అన్నాడు



నిప్పులు తొక్కుతూ. క్షణంలో ముగ్గురూ గడప దాటి వెళ్లిపోయారు.

శాస్త్రులుగారు ముక్కుమీద వేలేసుకుని అలాగే కూర్చుండిపోయారు.

''నీకిక ఈ జన్మలో పెళ్లికాదు'' అంది తల్లి కాత్యాయని.

''నేనిక నీకోసం ఏ సంబంధాలు తేను. తిరగలేక చస్తున్నాను'' అన్నాడు తండ్రి భరద్వాజ.

సమీర మాత్రం చిద్విలాసంగా నవ్వుతూ లోపలికి వెళ్లిపోయింది.

★ ★ ★

ఆరోజు సమీరకు ఎనిమిదవ పెళ్లిచూపులు.

మొదట వున్న హడావుడీ, ఆర్భాటం లేవు ఇప్పుడు ఆ ఇంట్లో.

కాత్యాయని, భరద్వాజ అప్పటికే నీరసించిపోయి నిరాశా నిస్పృహలతో వున్నారు. అందుకే రొటీన్‌లా పెళ్లిచూపుల ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎప్పటిలాగే ఆరోజూ... ఆ పెళ్లివారూ... అందరిలాగే వచ్చారు. చిరునవ్వుతో ఆహ్వానించి సోఫాలో కూర్చోబెట్టడం అయింది.

కాఫీలు, ఫలహారాలు తెచ్చిచ్చి 'తీసికోండి' అని మర్యాదపూర్వకంగా అన్నారు.

పెళ్లికొడుకు తండ్రి, తల్లి, సమీరను ప్రశ్నలేవో అడిగారు. తొణకని నిండుకుండలా కూర్చుని తన సహజ ధోరణిలో అనవసరపు సిగ్గులు, బిడియాలు లేకుండా తలెత్తి సమాధానం చెప్పింది సమీర.

''అమ్మాయి మాకు నచ్చింది. మీకూ మా సంబంధం నచ్చితే త్వరలోనే ముహూర్తాలు పెట్టుకుందాం'' అంది పెళ్లికొడుకు తల్లి అత్యుత్సాహంతో.

''అలా చెయ్యండి. జాతకాలు కూడా దివ్యంగా కలిసాయి'' అన్నారు శాస్త్రులుగారు.

''నాదొక్క రిక్వెస్ట్'' అంది సమీర.

''అయిపోయింది. ఇక ఈ సంబంధం కూడా 'హుష్ కాకి' అనుకున్నాడు భరద్వాజ.

''దీనికి ఎంతగా చెప్పి తీసుకొచ్చినా 'ఆ గూటి చిలుక...' అన్నట్లుగా ఆ పలుకే పలుకుతోంది. దీనికి ఇదేం పిచ్చో అర్థం కావటంలేదు. దీన్ని పెద్ద చదువులు చదివించి పొరపాటు చేసాం' అనుకుంది కాత్యాయని.

అడగదలుచుకుందేదో అడిగేసింది సమీర.

గుండెలు పీచుపీచుమన్నాయి ఆమె తల్లిదండ్రులకు.

ఒక్క నిముషం అక్కడ నిశ్శబ్దం చోటుచేసుకుంది.

తుపాను ముందు నిశ్శబ్దంలా అనిపించింది అక్కడివాళ్లకు ఆ మౌనం.

సమాధానం కోసం ఎదురుచూస్తూనే అవతలి వాళ్ల ఫేస్ రీడింగ్ చేస్తోంది సమీర.

ఉన్నట్లుండి ఎవరిదో 'శభాష్' అన్న కంఠస్వరం ఆ వెంటనే కరతాళధ్వని వినిపించి అందరూ తలెత్తి అటు చూసారు.

ఆనాటి పెళ్లిచూపులకు పిల్లవాడి వెంట అతని తల్లి, తండ్రితోపాటు మేనమామ కూడా వచ్చాడు. అతనికి సంబంధించినవే ఆ మాట, ఆ కరతాళ ధ్వని. ''వెరీగుడ్! నువ్వు నాకు చాలా...చాలా నచ్చేసావమ్మా. ఈకాలం పిల్లలంటే ఇలా వుండాలి'' అంటూ మేనల్లుడి వైపు తిరిగి ''నువ్వు చాలా అదృష్టవంతుడివిరా వికాస్. ఐ కంగ్రాచ్యులేట్ యూ. ఇంత ధైర్యం, ఇంత ముక్కుసూటితనం, ఎంతో ముందుచూపు, పరిస్థితులకనుగుణంగా స్పందించే ఫాస్ట్‌నెస్ వున్న అమ్మాయి నీ భార్యగా రాబోతోంది. ఇక నీ సంసారం నందనవనమే అనుకో...'' అన్నాడు ఆయన.

ఆయన పేరు డాక్టర్ కృష్ణమోహన్.


ఒక ప్రభుత్వ హాస్పిటల్‌లో సూపరింటెండెంట్‌గా వర్కుచేస్తున్నాడు. వైద్యరంగంలో తల నెరిసిన అనుభవమున్న వ్యక్తి.

ప్రస్తుతం సమాజాన్ని మహమ్మారిలా పట్టిపీడిస్తున్న 'ఎయిడ్స్'ను పారదోలటానికి విశేషంగా కృషి చేస్తున్న పరిశోధకుడు.

అలాంటి వ్యక్తిని, అంత మహోన్నతుడిని సమీర ధైర్యం, పెట్టిన కండిషన్ అంతగా స్పందింపచేసాయంటే చేయవూ మరి.

పెళ్లికొడుకు వికాస్ వృత్తిరీత్యా ఇంజనీరయినా, ప్రవృత్తిరీత్యా సామాజిక స్పృహ కలిగిన వ్యక్తి. చదువుకున్న ఆడపిల్లల చురుకుదనం, తెలివితేటల పట్ల ఇష్టం, నమ్మకం వున్నవాడు.

అందుకే చిరునవ్వుతో సమీర వంక చూస్తూ ''మీరు అడిగిందానికి నేనూ మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. ఇద్దరం రక్తపరీక్షలు చేయించుకుని వైద్యులు మనం ఆరోగ్యవంతులమని, మన ఇద్దరి బ్లడ్ గ్రూపులు సంసార జీవితానికి మ్యాచ్ అవుతాయని సర్టిఫికెట్ ఇచ్చినప్పుడే మనం పెళ్లి చేసుకుందాం'' అన్నాడు గంభీరస్వరంతో.




సమీర కళ్లల్లో రెండు మెరుపుతీగలు తళుక్కున మెరిసాయి వెంటనే. తను కోరుకున్న వ్యక్తి, తనను అర్థం చేసుకోగల పురుషుడు తన జీవిత భాగస్వామిగా రాబోతున్నందుకు ఆమె మనసు పురి విప్పిన నెమలిలా నాట్యం చేసింది.

ఇంకా నమ్మకం కలగక 'ఇది నిజమా, లేక కలా?' అన్నట్లు చూస్తున్నారు కాత్యాయని, భరద్వాజ. నిజమని ఎదుటి దృశ్యం చెబుతున్నా తమ కళ్లమీద తమకే విశ్వాసం లేనట్లు అనుమానంగా పెళ్లికొడుకు తల్లి, తండ్రి వంక చూసారు.

తండ్రి విశ్వనాథరావు, భరద్వాజ వంక చూస్తూ ''మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా ఈర్ష్యగా వుంది భరద్వాజగారూ.

ఇంత అందం, ఇన్ని తెలివితేటలు వున్న ఈ అమ్మాయి మీ కూతురిగా మీ ఇంట పుట్టినందుకు. ఈ పెళ్లి కుదిరాక ఆ ఈర్ష్య కొంచెం తగ్గుతుందిలెండి. ఎందుకంటే ముందు ముందు ఈ అమ్మాయి నా ఇంటి కోడలిగా మాతోటే వుండబోతున్నందుకు. అప్పుడు మీరే నన్ను చూసి ఈర్ష్యపడాలి... హ్హహ్హహ్హ!'' అంటూ బిగ్గరగా నవ్వాడు ఆయన.

''ఈ ఎయిడ్స్... గియిడ్స్ నాకేమీ తెలియదు గానీ నాకు మాత్రం ఈ అమ్మాయి చాలా చాలా నచ్చేసింది. మా కాలంలో మాకు లేని చదువులు, తెలివితేటలు, ధైర్యసాహసాలు ఈ కాలపు పిల్లల్లో వుండటం చూసి నేను ముచ్చటపడుతూ వుంటాను. ఈ రోజుల్లో పుట్టక ఆ రోజుల్లో ఎందుకు పుట్టానా అని బాధపడుతూ వుంటాను. చూడమ్మాయి సమీరా. నాకు ఆడపిల్లలు ఎలాగూ లేరు. కోడలయినా కూతురివయినా నువ్వే మాకు. పెళ్లిచూపుల ప్రశ్నల్లో, కండిషన్స్‌లో సైతం చోటుచేసుకున్న ఆ ఎయిడ్స్ అంటే ఏమిటో... దాని సంగతీ, సందర్భాలు అన్నీ మా ఇంటికొచ్చాక నువ్వే నాకు చెప్పాలి. నన్ను గురించి పట్టించుకోవడానికి మా ఇంట్లో ఈ మగమహారాజులిద్దరికీ టైమ్ వుండదులే. అందుకని అంటున్నాను'' అంది ఆ కాలంలో పుట్టినా ఈ కాలంలో మనిషిలా కనిపించే రాజ్యలక్ష్మి.

అందరూ 'ఓకే' అనడంతో గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నారు కాత్యాయని, భరద్వాజ.

తమ కడుపున పుట్టి, తమ ఇంట పెరిగిన తమ కూతురి తెలివితేటల మీద తమకు లేని నమ్మకం, విశ్వాసం ఇతరుల కంఠంలో ధ్వనించగా విని సిగ్గుపడ్డారు కూడా.

♣